సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 20 । మార్చి । 2024





..భక్తజన సంద్రం

నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ క్షేత్రం మంగళవారం జనసంద్రంగా మారింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.0 /21.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘మిషన్ భగీరథ’ ఫిర్యాదుల సెల్ ప్రారంభం

- ఫోన్ చేయాల్సిన నంబర్ 08542- 242024

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మిషన్ భగీరథ పథకంలో వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరమణ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని మిషన్ భగీరథ కార్యాలయం చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల సెల్ 08542-242024 నంబర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫిర్యాదుల సెల్ ఏర్పాటు చేశామని, మిషన్ భగీరథలో తలెత్తే సమస్యలను ఫిర్యాదు చేసేందుకు ఈ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని అందుకోసం ప్రభుత్వ కార్యాలయ సమయం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటారని, ఇది కేవలం గ్రామీణ ప్రాంతాల వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఇంటింటికీ నల్లా ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో వందశాతం పనులు పూర్తి అయ్యాయని, చిన్నపాటి పనులు ఉంటే వెంటనే పూర్తి చేస్తామన్నారు. అలాగే మహబూబ్‌నగర్ జడ్చర్ల, భూత్పూర్, నారాయణపేట తదితర మున్సిపాలిటీల్లో సమస్యలను అక్కడి కమిషనర్లకు తెలియజేయాలని సూచించారు.

మన్యంకొండలో అభివృద్ధి పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ ఎస్ఈ మల్లికార్జున్‌రెడ్డి, డీఈ శర్మ, ఏఈ బాలయ్య పరిశీలించారు. అలివేలు మంగ ఆలయం వద్ద నూతనంగా ప్రాకార నిర్మాణం, కల్యాణ మండపం, కొండపైన భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూ లైన్ల ఏర్పాటు, లడ్డూ ప్రసాదం, అన్నదానం గదుల నిర్మాణాలపై ఆరా తీశారు. వారి వెంట ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు తదితరులున్నారు.

రేపు జాబ్‌మేళా

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల ఐక్యూఏసీ, టీఎస్ కేసీ సంయుక్త ఆధ్వర్యంలో ఎల్అండ్‌టీ ఫైనాన్స్ సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.అప్పియా చిన్నమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 నుంచి 2023 వరకు డిగ్రీ పూర్తి చేసిన పురుష అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఎల్అండ్‌టీ ఫైనాన్స్ కంపెనీలో ఖాళీగా ఉన్న 30 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అర్హత కలిగిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

సరైన పత్రాలు లేకపోతే నగదు సీజ్



మహబూబ్‌నగర్ క్రైం: కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జిల్లాలో రాబోయే పార్లమెంట్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని, అలాగే కేంద్ర సాయుధ బలగాలు కూడా ఇప్పటికే జిల్లాకు వచ్చాయని ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయుధ బలగాలతో ప్రతినిత్యం ఏరియా డామినేషన్ వెహికల్ చెకింగ్ కోసం ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ఈ వారం నుంచి ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు, జిల్లాలో కొన్నిచోట్ల చెక్‌పోస్టులు ప్రారంభం చేస్తామన్నారు. జిల్లా ప్రజలు ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకువెళ్తున్న క్రమంలో సరైన పత్రాలు వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి నిత్యం వాహనాలు తనిఖీలు చేస్తామని, లిక్కర్, నగదుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. అధికంగా లిక్కర్, నగదు దొరికితే సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి పంపిస్తామన్నారు. రాష్ట్రంలో నాలుగో దశలో ఎన్నికలు ఉంటాయని, ప్రజలు ఓటరు కార్డులను అప్‌డేట్ చేసుకొని ఎన్నికల్లో ఓటు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మల్లెబోయిన్‌పల్లి శివారులో గల వెంచర్‌లో నామరూపాలు లేకుండాపోయిన చెరువు (ఫైల్)

రియల్ భూం.. చెరువులు మాయం

- **జడ్చర్ల పరిధిలో పేట్రేగిపోతున్న రియల్ వ్యాపారులు**
- ప్రజాప్రతినిధుల అండగా చెలరేగుతున్న వైనం
- కనిపించిన చెరువులు, కుంటలన్నీ ధ్వంసం
- వెంచర్లు వేసి.. ప్లాట్లుగా విక్రయం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



బూరెడ్డిపల్లిలో ఆక్రమణకు గురవుతున్న చెరువు

జడ్చర్ల: రియల్ భూం మాయలో చెరువులు, కుంటలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పూర్వకాలంలో దీర్ఘ దృష్టితో నిర్మించిన పలు చెరువులు, కుంటలు అన్యాక్రాంతమవుతున్నాయి. ఫలితంగా భావితరాలకు అక్కడ చెరువులు, కుంటలు ఉన్నాయని తెలిసే పరిస్థితి కూడా లేకుండాపోతుంది. ఎన్నో దశాబ్దాల క్రితం నిర్మించిన చెరువులు, కుంటలను ధ్వంసం చేసి వాటి స్థానాల్లో వెంచర్లు, ఫాంల్యాండ్స్ తదితర కమర్షియల్ భూములుగా మార్పు చేసి రియల్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే చాలా చెరువులు, కుంటలు వెంచర్లలో కలిసిపోయి కనీసం అక్కడ చెరువు ఉన్న దాఖలాలు కూడా లేకుండా మార్చేశారు.

విచ్చలవిడిగా ధ్వంసం

నియోజకవర్గంలో ఎక్కడికక్కడ చెరువులు, కుంటలను రియల్ వ్యాపారులు ధ్వంసం చేసేస్తున్నారు. వీరికి కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు లోపాయికారిగా సహకరిస్తుండటం వల్లే ఇలా చెలరేగిపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జడ్చర్ల మండలంలోని మల్లెబోయిన్‌పల్లి, బూరెడ్డిపల్లి గ్రామాల శివారులో చెరువులను నేలమట్టం చేశారు. దశాబ్దాల చరిత్ర కలిగిన గండెమ్మ చెరువును పెకిలించి ఆనవాళ్లు లేకుండా చేసి వెంచర్‌లో కలిపేశారు. ప్రస్తుతం ఇక్కడ వందల ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ ఏర్పాటు చేశారు. ఇదే వెంచర్‌ను అనుసరించి ఉన్న మురుగువాని కుంట కట్టను సైతం ఇందులో కలిపేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే గతంలో ఒకసారి చెరువు కట్టను తొలగించే ప్రయత్నించగా.. స్థానిక రైతులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆగిపోయింది. ఇటీవల మరోసారి వెంచర్ యజమానులు కుంట కట్టకు గండిపెట్టారు. దీంతో కుంటలో ఉన్న నీరంతా దిగువకు పారి వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీనిపై రైతులు మరోసారి అధికారులకు ఫిర్యాదు చేయడంతో మళ్లీ చెరువు గండిని పూడ్చారు. తమ వెంచర్‌కు అడ్డుగా ఉన్న కుంటకట్టను ఎలాగైనా ధ్వంసం చేసేందుకు మళ్లీ ప్రయత్నాలు చేస్తున్నారు.

- బాదేపల్లి ఊర చెరువులో సైతం వెంచర్ ఏర్పాటు చేశారు. జడ్చర్ల చెరువు శిఖంలోనూ ప్లాట్లు చేశారన్న ఫిర్యాదులు ఉన్నాయి. గంగాపూర్ శివారులోని వెంగళాయకుంటను సైతం నామరూపాలు లేకుండా చేసి వెంచర్‌లో కలిపేశారు. ఇదే గ్రామపరిధిలోని నాగులకుంటను కూడా ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా గ్రామస్తులు అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆగిపోయింది. బాలానగర్‌లో ఎర్రకుంటను కూడా మాయం చేశారని ప్రజలు పేర్కొంటున్నారు. బాలానగర్‌లో రెండు చెరువుల మధ్య లోతట్టు ప్రాంతాన్ని మట్టితో నింపి చెరువులోకి నీరు రాకుండా చేశారని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపిస్తుండటంతో చెరువులు, కుంటల ఆక్రమణ ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. మోతీఘనపూర్ పరిధిలోని కోమటి చెరువును సైతం ఆక్రమించే పరిస్థితి ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

నిబంధనలు గాలికి..

వెంచర్ల ఏర్పాటులో ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొన్ని చెరువులు, కుంటలలో ఉన్న పట్టా భూములు తమవే కాబట్టి అమ్ముకోవడం, వెంచర్లు ఏర్పాటు చేయడం చెల్లుతుందని కొందరు వాదిస్తున్నారు. అయితే చెరువులు, కుంటలలో ఉన్న శిఖం భూములు ఏక్‌సాల్ పట్టా కిందకు వస్తాయని, నీట మునిగినప్పుడు వదిలేయాలని, నీరు లేనప్పుడు మాత్రమే పంటలు సాగు **చేసుకోవాలని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అలాగే చెరువుల శిఖం, బఫర్ జోన్‌తో పాటు కాల్వల్లో నిర్మాణాలు చేపట్టవద్దని ఇరిగేషన్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.**

చర్యలు తీసుకోవాలి



ఏళ్ల క్రితం నిర్మించిన చెరువులను రియల్ వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. ప్రభుత్వం వాటిని రక్షించేలా చర్యలు తీసుకోవాలి. పట్టణ శివారులోని నల్లచెరువు, బాదేపల్లి నల్లకుంటతోపాటు బూరెడ్డిపల్లి శివారులోని కుంటలలో ఆక్రమణలకు పాల్పడ్డారు.

– సత్తయ్య, జడ్చర్ల

విచారణ చేస్తాం..



చెరువులు, కుంటలు ఆక్రమించడం, వెంచర్లుగా ఏర్పాటు చేయడం నేరం. రికార్డులలో లేని చెరువులు, కుంటలకు సంబంధించి కొందరు తొలగిస్తున్నట్లు సమాచారం ఉంది. బాదేపల్లి నల్లకుంట బఫర్ జోన్ ఆక్రమణపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్, జడ్చర్ల



నల్లకుంట బఫర్ జోన్‌లో వేసిన మట్టి

బాదేపల్లి నల్లకుంటకు ఎసరు

బాదేపల్లి నడిబొడ్డున ఉన్న నల్లకుంటలో సైతం వెంచర్ ఏర్పాటు చేసేందుకు రియల్ వ్యాపారులు మట్టితో నింపేశారు. తమ పట్టా భూమిని వదిలి కుంట బఫర్ జోన్‌లోకి వచ్చి ఆక్రమించారు. దీనిపై స్థానిక రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా అంతంత మాత్రంగానే చర్యలు ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి.

‘దివ్యాంగురాలి దీనగాథ’పై..
ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా

- రెండురోజుల్లో ఆధార్ కార్డు ఇస్తామని హామీ
- వివరాలు సేకరించిన కాడా ప్రత్యేకాధికారి
- బియ్యం అందజేసిన తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..

కోస్గి: ఆధార్ కార్డు లేక **ప్రభుత్వ** పథకాలకు **నోచుకోని** ఓ మహిళ **ఉదంతం**పై ‘సాక్షి’లో **మంగళవారం** ప్రచురితమైన ‘దివ్యాంగురాలి **దీనగాథ**’ కథనానికి **అధికార** యంత్రాంగం స్పందించింది. ఏకంగా **ముఖ్యమం**త్రి కార్యాలయం నుంచి బాధి**తులకు ఫోన్** చేసి రెండురోజుల్లో ఆధార్ కార్డు **అందిస్తా**మని హామీ ఇచ్చారు. కాడా ప్రత్యేకా**ధికారి** వెంకట్‌రెడ్డి సమగ్ర వివరాలు సేకరించి **బాధితురా**లికి త్వరలోనే ఆధార్ అందించేం**దుకు చర్య**లు తీసుకుంటున్నామని చెప్పారు. కోస్గి తహసీల్దార్ శ్రీనివాసులు స్వయంగా మాసాయపల్లికి వెళ్లి బాధిత కుటుంబానికి 15 కిలోల బియ్యం అందించారు. బాధితురాలి కూతురు సింధూజ పరీక్ష ఫీజు చెల్లించలేక ఇంటర్ పరీక్షలు రాయలేకపోయిన విషయం తెలుసుకొని తహసీల్దార్ శ్రీనివాసులు తాను సొంతంగా ఇంటర్ చదివిస్తానని భరోసా ఇచ్చారు. గ్రామానికి అధికారులు వెళ్లినప్పటికీ కూలి పనులకు వెళ్లిన లక్ష్మి అందుబాటులో లేకపోవడంతో ఆమె కూతురుతో మాట్లాడారు. ఆధార్ కార్డు ఇవ్వడానికి రుజువు కావాల్సి ఉండటంతో ఓటరు జాబితాలో ఆమె పేరు గుర్తించి ఓటరు గుర్తింపు కార్డు సైతం సిద్ధం చేశామని, ఆమెకు ఆధార్ కార్డు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు చెప్పారు.



లక్ష్మి కూతురు సింధూజకు బియ్యం అందిస్తున్న తహసీల్దార్



‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన కథనం

ఉచిత ప్రయాణంతో ఆటోవాలాలు ఆగం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోవాలాల జీవితాలు రోడ్డున పడ్డాయని ‘ఆటోబతుకులు’ సీరియల్ హీరో రవికుమార్ అన్నారు. ఆటో బతుకులు సీరియల్ ప్రచార రథయాత్ర మంగళవారం జిల్లాకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు యాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో నడుపుకొని పొట్ట పోసుకునే ఆటోవాలాల జీవితాలు ఆగం అయ్యాయన్నారు. తాను ఓ ఆటో కార్మికుడినని ఆటోవాలాల జీవితాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఆటో బతుకులు పేరుతో సీరియల్ తీస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో లక్షలాది ఆటోవాలాల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరాకీలు లేక ఆటో డ్రైవర్లు ఇప్పటి దాకా పదుల సంఖ్యలో ఆత్మహత్య చేసుకున్నారని వాపోయారు. ప్రభుత్వం పునరాలోచించి తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. ఎంపీ ఎన్నికల్లో పార్టీలకతీతంగా ఆటోవాలాలు తమ గళం వినిపించాలని, తమకు ప్రత్యామ్నాయం చూపకుంటే వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనిట్ సభ్యులు మధు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాజు, నాయకులు రాములుయాదవ్, నాగరాజు, నర్సింహులు, నర్సింగ్‌గౌడ్, సాజిద్, పాషా, ఇమ్రాన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో బతుకులు రథయాత్ర కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

గులాబీ కొత్త వ్యూహం..

- నాగర్‌కర్నూల్ బరిలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- ఎస్సీ రిజర్వ్ స్థానంలో బీఆర్ఎస్ గెలుపు కోసం వ్యూహాత్మకంగా అడుగులు
- సిట్టింగ్ ఎంపీ రాములు కమలంలో చేరడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల వేళ తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం బీఆర్ఎస్ పార్టీ కొత్త వ్యూహాలను రచిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 స్థానాలకు 12 స్థానాలను కోల్పోయిన బీఆర్ఎస్.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనైనా పట్టు సాధించాలనే తలంపుతో ప్రయత్నాలను సాగిస్తోంది. ఇందులో భాగంగా ఎస్సీ రిజర్వ్ స్థానమైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంపై ప్రత్యేక వ్యూహంతో ముందుకెళుతోంది. ఈ స్థానంలో గెలుపు కోసం ఏకంగా బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పొత్తు ఒప్పందానికి అంగీకరించడం, పరిణామ క్రమంలో ఆయన పార్టీకే రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరడం ఆసక్తికరంగా మారింది.

ఎంపీ రాములు పార్టీ వీడటంతో..

బీఆర్ఎస్ నుంచి ఎంపీగా గెలుపొందిన రాములు స్థానిక ఎమ్మెల్యేలతో పోరు, పార్టీలో అసంతృప్తి నేపథ్యంలో ఇటీవల బీజేపీలో చేరారు. ఈ అనూహ్య పరిణామాల క్రమంలో లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ప్రత్యామ్నయ అవకాశాలపై దృష్టి పెట్టింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అలంపూర్ వాసి, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను తమ పార్టీలో చేర్చుకుని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో దింపనుంది. తద్వారా ఎస్సీ రిజర్వ్ స్థానమైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో విజయం సాధిస్తామన్న నమ్మకంతో ఉంది.

వెంట రాని కేడర్..

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆపార్టీని విడిచి బీఆర్ఎస్‌లో చేరారు. జిల్లాలోని బీఎస్పీ కేడర్ సైతం ఆయన వెంటనే ఉంటారని భావించారు. అయితే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో గులాబీ చెంతకు చేరినా తాము మాత్రం పార్టీనే నమ్ముకుని ఉంటామని బీఎస్పీ శ్రేణులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ‘పార్టీలోకి వ్యక్తులు వస్తుంటారు, పోతుంటారు. కానీ పార్టీ మాత్రం శాశ్వతంగా ఉంటుంది. బీఎస్పీ ఎవరితో పొత్తు పెట్టుకోవడం లేదు. ఈ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నాం’ అంటూ బీఎస్పీ నేతలు ప్రకటించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్ వంటి నేతలు తాము బీఎస్పీలోనే కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థిపై వీడని సస్పెన్స్..

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాలుండగా దాదాపు ప్రధాన పార్టీల లోక్‌సభ అభ్యర్థులు ఎవరన్నది తేలిపోయింది. అయితే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి పేరును అధిష్టానం ప్రకటించాల్సి ఉంది. ఈ స్థానాన్ని పార్టీ సీనియర్ నేత, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవికే కేటాయించినట్లు ప్రచారం సాగుతున్నా, అభ్యర్థి ప్రకటన ఆలస్యం కావడంతో ఇంకా సస్పెన్స్ నెలకొంది.

ఆముదాలు క్వింటాల్ రూ.5,602

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన ఈనామ్ టెండర్లలో ఆముదాలు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,602 ధర లభించింది. అలాగే ఆర్ఎన్ఆర్ ధాన్యం క్వింటాల్ రూ.2 వేలు గా ఒకే ధర పలికింది. మార్కెట్‌కు ఆముదాలు, వరి ధాన్యం మాత్రమే అమ్మకానికి వచ్చాయి.

నేడు ఉల్లిపాయల వేలం..

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం ఉల్లిపాయల బహిరంగ వేలం జరుగుతుంది. సీజన్ కావడంతో వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున ఉల్లి అమ్మకానికి వస్తుంది. వేలం ఉదయం ప్రారంభం కానుండగా దేవరకద్ర వ్యాపారులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు వేలంలో పాల్గొంటారు. ప్రస్తుతం ఉల్లి ధరలు నిలకడగానే ఉన్నాయి. బుధవారం వేలంలో ధరలు ఏ విధంగా ఉంటాయో వేచి చూడాలి.

మోదీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్రమోదీని మళ్లీ ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతిఒక్క అభ్యర్థి, కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందని మహబూబ్‌నగర్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం పద్మావతికాలనీలోని కాళికాంబ కల్యాణ మండపంలో మంగళవారం ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈసారి ప్రజల్లో మళ్లీ ఈ ఓటు మోదీ కోసమే.. మళ్లీ మోదీనే రావాలి అనే నినాదంతో ముందుకెళ్లాలన్నారు. రాజకీయాల్లో ఏనాడు కూడా గ్రూప్ రాజకీయాలు చేయలేదని, పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. బీజేపీలో ఉన్న ప్రతి కార్యకర్త కూడా కుటుంబంగా భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ రామచందర్‌రావు, పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి, చిత్తరంజన్‌దాస్, నాగురావు నామాజీ, నర్సింహగౌడ్, భీమ్‌రెడ్డి, పద్మజారెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, వీరబ్రహ్మచారి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్ష కేంద్రాల తనిఖీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు మంగళవారం రెండోరోజు ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష రాశారు. మొత్తం 59 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయగా.. ఇందులో 12,718 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 12,609 మంది హాజరవగా.. మరో 49 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ రవీందర్ 7 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 26 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

కామర్స్‌తో ఉజ్వల భవిష్యత్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు కామర్స్ సబ్జెక్టు ద్వారా ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. మంగళవారం పీయూలో తెలంగాణ కామర్స్ అసోసియేషన్ సౌజన్యంతో బీకాం విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కామర్స్ ద్వారా మార్కెట్‌లో వస్తున్న అనేక మార్పులతో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. వీటి ద్వారా డిజిటల్ మార్కెటింగ్‌తోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అనేక కొత్త కోర్సులు వస్తున్నాయని, వాటి గురించి తెలుసుకుని విద్యార్థులు చదువుకుంటే మంచి అవకాశాలు వస్తాయన్నారు. మరిన్ని నైపుణ్యాలు నేర్చుకోవడం ద్వారా సులువుగా ఉద్యోగం సాధించేందుకు అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు, టీసీఏ అధ్యక్షుడు చెన్నప్ప, కృష్ణచైతన్య, వెంకటేశ్వర్‌రావు, కన్వీనర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వెంకటేశ్వర్లు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధ్యాపకుడి ఆత్మహత్యాయత్నం

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కెమిస్ట్రీ అధ్యాపకుడు శంకర్ ఆత్మహత్యకు యత్నించారు. రోజు మాదిరిగానే విధులకు హాజరైన ఆయన.. తనవద్ద ఉన్న మాత్రలు వేసుకున్నారు. గమనించిన తోటి అధ్యాపకులు అతడిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అధ్యాపకుడి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వివాహిత బలవన్మరణం

బిజినేపల్లి: చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని భర్త మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని పోలెపల్లి గ్రామ నేలగడ్డతండాకు చెందిన పార్వతమ్మ (40), భర్త గోపాల్, కుమారుడు నవీన్‌కుమార్ మంగళవారం ఉదయం ఇంటి బయట కూర్చున్నారు. జర్దా, కల్లు వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని గోపాల్ తన భార్యను గట్టిగా మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన పార్వతమ్మ ఇంట్లోకి వెళ్లి పురుగుమందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. కుమారుడు నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వివరించారు. పార్వతమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భార్య అవమానించిందని భర్త..

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్‌కు చెందిన వేముల చక్రవర్తి (32) భార్య అవమానించడంతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గంగారం గ్రామానికి చెందిన దేవికి చక్రవర్తితో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. భర్త మద్యానికి బానిసయ్యాడని ఏడాదిన్నర కిందట తన ఇద్దరు కుమార్తెలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. అంతటితో ఆగక కోర్టులో కేసు వేయడమే కాకుండా కోర్టుకు వచ్చిన చక్రవర్తిని అందరి ముందు అవమానించింది. దీంతో మనస్తాపానికి గురైన చక్రవర్తి మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చక్రవర్తి తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

నలుగురు చిన్నారులపై వీధికుక్కల దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: నలుగురు చిన్నారులపై వీధికుక్కలు దాడికి పాల్పడిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లలో సోమవారం చోటుచేసుకోగా మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎండబెట్లకి చెందిన చిన్నారులు పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా.. నలుగురు చిన్నారులపై దాడి చేయడంతో స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువైందని, అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

ఉండవెల్లి: పట్టణ శివారులోని మలుపు వద్ద మంగళవారం కంచుపాడుకు వెళ్తున్న బైక్‌ను కర్నూలు నుంచి వస్తున్న మరో బైక్ వెనుక నుంచి ఢీకొనడంతో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారి కథనం మేరకు.. మానవపాడు మండలం చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన వృద్ధుడు వెంకటన్న ద్విచక్ర వాహనంపై కంచుపాడు వెళ్తుండగా.. ధర్మవరం గ్రామ సమీపంలో ఉన్న పల్లెకు చెందిన ఇద్దరు యువకులు కర్నూలు నుంచి అతి వేగంగా వచ్చి ముందు వెళ్తున్న వెంకటన్న వాహనాన్ని ఢీకొనడంతో కాలు, చెయ్యి విరిగింది. వెంటనే హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు.

ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు

హన్వాడ: ఆటో బోల్తా పడి ముగ్గురు విద్యార్థులకు గాయాలైన సంఘటన మంగళవారం మండల పరిధిలోని మాదారం గేట్ వద్ద చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మునిమోక్షానికి చెందిన పలువురు విద్యార్థులు మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు రాత్రి 8 గంటల ప్రాంతంలో గౌండ్యాల్ ప్యాసింజర్ ఆటో ఎక్కారు. ఈ క్రమంలో మాదారం గేట్ పరిసర ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా అడవి పంది రావడంతో వేగంగా వెళ్తున్న ఆటో పందిని ఢీకొట్టడంతో ఒక్కసారిగా ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో పదో తరగతి విద్యార్థులు అనిల్, రాజుతో పాటు మేస్త్రీ పని చేసే చెన్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దారి వెంట వెళ్లే వారు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేష్ తెలియజేశారు.

తాగునీటి మళ్లింపునకు యత్నం

- మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం.. నీటి కష్టాలు తప్పవంటున్న ప్రజలు



మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు రంధ్రం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అమరచింత: పట్టణంలోని ఆరు ఓవర్‌హెడ్ ట్యాంకులకు మిషన్ భగీరథ తాగునీటిని అందించే ప్రధాన ఇన్‌లెట్ పైపునకు రంధ్రం వేసి నీటిని మళ్లించే యత్నానికి సిద్ధమయ్యారు పుర అధికారులు. కొత్త బస్టాండ్ ప్రాంతంలోని ఇళ్లకు తాగునీరు అందడం లేదనే కారణం చూపుతూ పనులు చేపట్టడం విశేషం. పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీరందక తాగునీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి ప్రత్యేక పైప్‌లైన్ వేసి బస్టాండ్ ప్రాంతానికి శాశ్వతంగా తాగునీటిని అందించే అవకాశం ఉన్నా.. పుర అధికారులు దృష్టి సారించడం లేదు. తాగునీటి సరఫరా ఎలా ఉందని తెలుసుకోని మున్సిపల్ ఏఈ ప్రధాన పైప్‌లైన్‌కు రంధ్రం వేసి నీటిని అందించమని సిబ్బందిని ఎలా ఆదేశించారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బస్టాండ్ ప్రాంతానికి తాగునీటిని మళ్లించే యత్నంలో భాగంగా సోమవారం రాత్రి ప్రధాన పైప్‌లైన్‌కు రంధ్రం వేసి గేట్‌వాల్వ్ ఏర్పాటుచేయగా వత్తిడికి నీరంతా ఎగిసిపడటంతో పరిసరాలు జలమయమయ్యాయి. ఈ విషయం తెలిసినా మిషన్ భగీరథ ఏఈ స్పందించకపోవడం విడ్డూరం. పురపాలికలో పది వార్డులుండగా.. కనీసం ఐదు వార్డులకు కూడా మిషన్ భగీరథ నీరు అందడం లేదని, సోర్సుబోర్లతోనే కాలం వెళ్లదీస్తున్నామని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు.

తాగునీటి ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి

వేసవిని దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ ఆదేశాల మేరకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలోని ఇళ్లకు తాగునీరు సరఫరా కావడం లేదని తెలిసి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించాం. పట్టణ ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణ, మిషన్ భగీరథ ఏఈ, అమరచింత

జములమ్మ క్షేత్రం.. భక్తజన సంద్రం



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో జములమ్మ

గద్వాల న్యూటౌన్: నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ క్షేత్రం మంగళవారం జనసంద్రంగా మారింది. తెల్లవారుజామునుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. నడిగడ్డ ప్రాంత ప్రజలతో పాటు, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. జములమ్మ, పరశురామస్వామి ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను సల్లంగా చూడు జములమ్మ తల్లీ అంటూ వేడుకున్నారు. ఇదిలా ఉండగా, ఆలయ ప్రాంగణంలో భక్తులకు రద్దీకి అనుగుణంగా తాగునీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఆలయ ముఖద్వారం వద్ద ప్రధాన రహదారిపై పలుమార్లు ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

పకడ్బందీగా ఎన్నికల కోడ్



బాలానగర్ చెక్‌పోస్టు వద్ద కారులోని వ్యక్తి నుంచి సీజ్ చేసిన రూ.1,01,500ను చూపుతున్న ఎస్ఐ తిరుపాజీ



పెబ్బేరు కర్నూల్ బైపాస్ వద్ద వాహన తనిఖీలో పట్టుబడిన నగదు

- రూ.2,94,800 నగదు సీజ్ చేసిన పోలీసులు

బాలానగర్: ఎన్నికల కోడ్‌ను పోలీస్ అధికారులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మొదటి రోజే మంగళవారం మండలంలో వాహనాల చెకింగ్‌లో భాగంగా రూ.1,54,500 పోలీసులు సీజ్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్ ఆధ్వర్యంలో బాలానగర్ ఎస్ఐ తిరుపాజీ, రాజాపూర్ ఎస్ఐ రవి తదితరులు సోదాలు నిర్వహించారు. ఎలాంటి ధ్రువ పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1,54,500 నగదు సీజ్ చేశారు. కర్నూల్ జిల్లాకు చెందిన వెంకటేశ్వర్ రావు వద్ద రూ.1,01,500, బాలానగర్ మండలం చింతకుంటకి చెందిన లక్ష్మణ్ నుంచి రూ.53,000 సీజ్ చేసినట్లు సీఐ నాగార్జున గౌడ్ తెలియజేశారు.

వనపర్తి వద్ద రూ.90,300

వనపర్తి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీల్లో మంగళవారం పోలీసులు రూ.90,300 నగదు సీజ్ చేశారు. పెబ్బేరు మండలం రంగాపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఎలాంటి రసీదు లేకుండా ఓ కారులో తీసుకువెళ్తున్న నగదును గుర్తించి సీజ్ చేసినట్లు డీఎస్పీ జె. వెంకటేశ్వర రావు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం.. ఒక వ్యక్తి రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లాలంటే రసీదులు గాని, బ్యాంకు కౌంటర్ ఫైల్స్ గాని తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

అమరచింత వద్ద రూ.50 వేలు

అమరచింత: జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలో రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సురేష్ కుమార్ తెలియజేశారు. అమరచింత నుంచి నర్వ మండల కేంద్రానికి బైక్‌పై వెళ్తున్న హరీష్ బైక్‌ను తనిఖీ చేయగా.. రూ.50 వేల నగదు లభించిందన్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్‌చేసి నారాయణపేట గ్రీవెన్స్‌సెల్‌కు పంపామన్నారు. వ్యక్తిగత, వ్యాపార నిమిత్తం వెళ్తున్న ప్రజలు రూ.50 వేలకు సంబంధించిన సరైన ఆధారాలు పెట్టుకుని ప్రయాణం చేయాలని సూచించారు.

పంటల సాగుపై అవగాహన

అయిజ: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనారు. పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్లు.. సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు చేశారు. వరి సాగులో ప్రస్తుతం పాటించాల్సిన జాగ్రత్తల గురించి జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా. బి.శ్రీనివాస్, ఆయిల్ పాం సాగుపై కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి అవగాహన కల్పించారు. డీన్ ఆఫ్ హార్టికల్చర్ శాస్త్రవేత్త డా. రాజశేఖర్, వేసవిలో కూరగాయల సస్యరక్షణపై రాజేంద్రనగర్ అఖిల భారత సస్యరక్షణ మందుల అవశేషాల పరిశోధన విభాగం శాస్త్రవేత్త డా. కె.కవిత వివరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, ఏఈఓలు పాల్గొన్నారు.

తగ్గుతున్న రామన్‌పాడు నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. మంగళవారం నీటి మట్టం 1,011 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

పరీక్ష రాసి.. తల్లి అంత్యక్రియలకు



పరీక్షకు హాజరైన జ్యోతి

దేవరకద్ర: కన్నతల్లి కళ్ల ముందే నిర్జీవంగా మారగా.. ఓ విద్యార్థిని దుఃఖభారంతో పదో తరగతి పరీక్షకు హాజరైంది. వివరాల్లోకి వెళ్తే.. దేవరకద్ర కురుమ వాడకు చెందిన అంజమ్మ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందింది. ఆమె రెండో కూతురు జ్యోతి దేవరకద్రలో పదో తరగతి పరీక్షలు రాస్తోంది. ఓవైపు తల్లి మృతితో కన్నీటి పర్యంతం అవుతూనే, మరోవైపు మంగళవారం జరిగిన పరీక్షకు హాజరైంది. పరీక్ష అనంతరం తల్లి అంత్యక్రియల్లో పాల్గొంది.

ప్రమాదానికి గురైనా..

మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడుకు చెందిన పదో తరగతి విద్యార్థి ప్రవీణ్‌కుమార్ సోమవారం పరీక్ష రాసేందుకు మండల కేంద్రానికి బైక్‌పై వస్తూ ప్రమాదానికి గురైన విషయం విదితమే. అతడికి కర్నూల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స అందించారు. మంగళవారం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో పరీక్షకు హాజరయ్యాడు. మరో విద్యార్థి మధుకు తీవ్రగాయాలు కావడంతో పరీక్షకు హాజరు కాలేదు.

గిరిజనుల అభ్యున్నతికి ప్రత్యేక కృషి



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: గిరిజనుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలతో కార్యక్రమాలు చేపడతామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉమ్మడి కొల్లూర్ పంచాయతీ పరిధిలోని ఎర్రవాడ్కతండాలో సంత్‌సేవాలాల్ , దుర్గమాత ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రధానంగా గిరిజనతండాలకు కనీస సౌకర్యాలు పూర్తి చేసి వాటిని అభివృద్ధిలోకి తెస్తామన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న గిరిజనతండాల్లో అంతర్గత రోడ్లు, వీధిదీపాలు తదితర వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మండల పరిధిలోని లింగంపల్లి ఆర్‌సీపూర్ చౌరస్తా నుంచి తిరుమలపూర్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు కోసం రూ. 22 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వివరించారు. కాగా ఈ పనులకు టెండర్లు సైతం పూర్తయినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

దేపల్లి మాజీ సర్పంచ్ రాములు మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాసు, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, పీసీసీ అధికార ప్రతినిధి జహీర్, బంగ్లరవి, నాయకులు నర్సింహచారీ, శర్మ, ఖాజా, మల్లేష్‌యాదవ్, రాజేష్, ఆంజనేయులు, కుమార్, వెంకటయ్య, కృష్ణ, అమరేష్ పాల్గొన్నారు.

పెంపుడు కుక్క ప్రాణం తీశాయని.. వీధికుక్కలపై ప్రతాపం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్



కుక్కలను చంపడానికి ఉపయోగించిన 0.22 రైఫిల్

- లైసెన్స్ రైఫిల్‌తో వెంటాడి 25 శునకాలను హతమార్చిన ముగ్గురికి రిమాండ్
- పొన్నకల్ ఘటన వివరాలు వెల్లడించిన ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్ క్రైం: తన పెంపుడు కుక్క ప్రాణం తీయడంతో పాటు, మరో పెంపుడు కుక్కను గాయాలయ్యేలా దాడి చేశాయని.. ఓ వ్యక్తి వీధి కుక్కలపై పగ పెంచుకున్నాడు. తన స్నేహితులతో కలిసి 25 వీధి కుక్కలను వెంటాడి గన్‌తో హతమార్చాడు. అడ్డాకుల మండలం పొన్నకల్‌లో చోటుచేసుకున్న ఈఘటన జిల్లాలో కలకలం రేపింది. రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. వీధి కుక్కలను చంపిన వారిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్ వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన మంద నర్సింహారెడ్డి గత ఫిబ్రవరి మొదటి వారంలో అతడి అత్తగారి ఊరైన పొన్నకల్‌కు వచ్చాడు. ఈక్రమంలో డాష్‌హ్యాండ్ జాతికి చెందిన అతడి పెంపుడు కుక్కను గ్రామంలోని వీధి కుక్కలు కరిచి చంపాయి. మరో పెంపుడు కుక్కను గాయపర్చాయి. దీంతో వీధి కుక్కలపై మంద నర్సింహారెడ్డి కోపం పెంచుకున్నాడు. గ్రామంలోని కుక్కలను ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో ఫిబ్రవరి 15న అతడి స్నేహితులు తారిక్ అహ్మద్, మహ్మద్ తాహీర్‌తో కలిసి కారులో హైదరాబాద్ నుంచి పొన్నకల్‌కు వచ్చారు. అర్ధరాత్రి 1:30 గంటల ప్రాంతంలో తారిక్ అహ్మద్ వద్ద ఉన్న లైసెన్స్ వెపన్ 0.22తో అంబేద్కర్ విగ్రహం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు రోడ్డు వెంట కన్పించిన 25 వీధి కుక్కలను కాల్చిచంపారు. ఈకేసులో ఏ–1 మంద నర్సింహారెడ్డి, ఏ–2 తారిక్ అహ్మద్, ఏ–3 మహ్మద్ తాహీర్‌లపై పలు సెక్షన్లతో పాటు జంతుచట్టం, హార్స్ యాక్ట్‌ల కింద కేసులు నమోదయ్యాయి. వీరిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. వారి నుంచి 0.22 రైఫిల్, కారు, ఆరు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సీఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుడికి గోల్డ్‌మెడల్



రవికుమార్

నారాయణపేట రూరల్: చండీఘడ్‌లో మంగళవారం జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 400 మీటర్ల రిలే పరుగుపందెంలో జిల్లా క్రీడాకారుడు రవికుమార్ ప్రతిభకనబర్చి, బంగారు పతకం సాధించాడు. ఈసందర్భంగా అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

పెళ్లింట విషాదం

- రెండు రోజుల్లో చెల్లెలి పెళ్లి.. ట్రాక్టర్ బోల్తాపడి అన్న దుర్మరణం
- గతంలోనే తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి
- ముంగిమళ్లలో విషాద ఘటన



బిచ్చప్ప (ఫైల్)

కోస్గి: మరో రెండు రోజుల్లో చెల్లెలి పెళ్లి చేయాల్సిన సోదరుడిని ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటన పెళ్లింట తీవ్ర విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. కోస్గి మండలం ముంగిమళ్ల గ్రామానికి చెందిన బోయిని నర్సింహులు, చెన్నమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. పదేళ్ల కిందట చెన్నమ్మ, ఐదేళ్ల కిందట నర్సింహులుతో పాటు ఓ కూతురు అనారోగ్యంతో మృతిచెందారు. తల్లిదండ్రుల మృతితో అన్నా చెల్లెలు బిచ్చప్ప(20), అనూష అనాథలుగా మారారు. బిచ్చప్ప ట్రాక్టర్‌పై కూలీ పనులకు వెళ్తూ.. చెల్లెలిని చదివించాడు. ఇటీవల గుండుమాల్‌కు చెందిన వ్యక్తితో అనూషకు పెళ్లి సంబంధం కుదిరింది. ఈనెల 22న పెళ్లి ముహూర్తం నిశ్చయమైంది. బిచ్చప్ప ఓవైపు పెళ్లి ఏర్పాట్లు చేస్తూనే.. మరోవైపు ట్రాక్టర్‌పై కూలీ పనులకు వెళ్తున్నాడు. ఈక్రమంలో సోమవారం అర్ధరాత్రి కొత్తపల్లికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌పై కూలీపనికి బయల్దేరాడు. గ్రామ శివారులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బిచ్చప్పకు తీవ్రగాయాలు కావడంతో గ్రామస్తులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, తల్లిదండ్రులను కోల్పోయిన అనూష సోదరుడు బిచ్చప్ప సంరక్షణలో ఉంటుంది. విధి వక్రీకరించి సోదరుడు సైతం ట్రాక్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందడంతో ఒంటరిగా మిగిలిపోయింది. సోదరుడి మృతితో అనూష రోధనలు పలువురిని కంటతడి పెట్టించాయి. ఈఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎద్దుల లారీని అడ్డుకున్న యువకులు



కంటెయినర్ లారీలోని ఎద్దులు

అడ్డాకుల: ఎద్దులను అక్రమంగా కంటెయినర్‌లో తరలిస్తుండగా.. బీజేపీకి చెందిన యువకులు అడ్డుకున్న సంఘటన చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కంటెయినర్‌లో 32 ఎద్దులను షాద్‌నగర్ ప్రాంతం నుంచి సోమవారం రాత్రి తమిళనాడులోని పలాచీకి తరలిస్తున్నారు. హైదరాబాద్‌లోని గోరక్షక్ దళ్‌కు సమాచారం అందడంతో అడ్డాకులకు చెందిన బీజేపీ నాయకులకు వారు సమాచారం చేరవేశారు. లారీని పోలీసులకు పట్టించాలని తెలియజేశారు. దీంతో కావలిరాజు, చెన్నకేశవులు, నరేష్, నరేందర్, శ్రీకాంత్‌తో పాటు మరికొందరు యువకులు శాఖాపూర్ టోల్ ప్లాజా వద్ద సోమవారం అర్ధరాత్రి కాపుకాశారు. ఎద్దులను తరలిస్తున్న లారీని అడ్డగించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. లారీని పరిశీలించిన పోలీసులు అందులో 32 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. వాటిని వెల్దండలోని గోశాలకు తరలించారు. కంటెయినర్ డ్రైవర్ అబ్దుల్ రషీద్‌పై యువకులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలియజేశారు.